

మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన


ప్రజాశక్తి-కడియం

కడియపులంకలోని శివాలయం, జాతీయ రహదారి పక్కన గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తెప్పోత్సవం, గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్పి ఎం.అంబికా ప్రసాద్, కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ బి.కృష్ణసాయి పర్యవేక్షించారు. ఆలయాల పరిసర ప్రాంతాలు, అన్నదానం జరుగు ప్రదేశం, పార్కింగ్ స్థలాలను పోలీస్ అధికారులు పరిశీలించి, స్థానిక పెద్దలతో సమావేశమయ్యారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున జనం తరలి వస్తారు. సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఇరు దేవాలయాల చైర్మన్లు పల్ల సుబ్రమణ్యం, మార్గాని సత్యనారాయణ పాల్గొన్నారు.

గెలిచేదెవరు.. గెలిపించేదెవరు..

గోపాలపురంలో అధికార, విపక్ష నేతల్లో అయోమయం
అధినేతల నిర్ణయాలపై ఇరు పార్టీల్లో అసంతృప్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి




గోపాలపురం నియోజకవర్గంలో గెలిచేదెవరు.. గెలిపించేదెవరు..అనే ప్రశ్న తలెత్తుతోంది. అధికార వైసిపి, టిడిపి, జనసేన కూటమిల అధినేతల నిర్ణయాలే ఈ దుస్థితికి కారణమనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన తానేటి వనిత తాజా ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గంలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అయ్యారు. 2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో గెలుపొందిన తలారి వెంకటరావు కొవ్వూరు బరిలో పోటీ చేయనున్నారు. దీంతో ఆయన అనుచరుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో నియోజకవర్గ కేంద్రంతో పాటు మరికొన్ని సెగ్మెంట్లలో తానేటి వనితకు సహకారం నేతి బీర చందంగా మారింది. 2009లో ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి తానేటి వనిత గెలుపొందారు. 1994, 1999 రెండు ఎన్నికల్లోనూ తానేటి వనిత తండ్రి జొన్నకూటి బాబాజీరావు ఈ నియోజకవర్గం నుంచే ఎంఎల్ఎగా గెలుపొందారు. ఈ నేపథ్యంలో గత అనుభవంతో మరోసారి గెలిచేందుకు టిడిపి కేడర్‌ను సైతం ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో వేచి చూడాలి.

ఖరారు కానీ టిడిపి, జనసేన అభ్యర్థి

ఒక వైపు ఎన్నికల ప్రకటనకు రోజులు దగ్గర పడుతున్నప్పటికీ టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి ఎవరు అనే ప్రశ్న కార్యకర్తలను వెంటాడుతోంది. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే అధికార, విపక్ష నేతల పేర్లు ఖరారు కావటంతో ప్రచారానికి సైతం శ్రీకారం చుట్టారు. అయితే ఈ నియోజక వర్గంలో టిడిపికి ఘన చరిత్ర ఉంది. 1983లో టిడిపి స్థాపించినప్పటి నుంచి జరిగిన తొమ్మిది ఎన్నికల్లో ఐదుసార్లు టిడిపి అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. 2004లో కాంగ్రెస్, 2019లో వైసిపి గెలుపొందాయి. 2004లో గెలుపొందిన టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికంగా ముఖ్యనాయకులను కలుపుకొని వెళ్లకపోవడం, నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో 2019లో ఓటమి పాలయ్యారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు తాజా ఎన్నికల్లో మద్దిపాటి వెంకటరాజుకు టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మద్దిపాటి వెంకటరాజుకు సహకరించే పరిస్థితి లేదు. అభ్యర్థిని ఖరారు చేయడం ఆలస్యం కావటం, గతంలో టిడిపి నుంచి గెలుపొందిన అభ్యర్థి ప్రత్యర్థి కావటంతో 2019 పరిస్థితులు పునరావృతం అయ్యేలా ఉన్నాయనే భయం కేడర్‌ను వెంటాడుతోంది.

తిష్ట వేసిన ప్రజా సమస్యలు

2019లో ఎన్నికల ముందు స్థానికంగా ఇచ్చిన హామీలను వైసిపి అమలు చేయలేదు. ఈ నియోజకవర్గంలోని ద్వారకా తిరుమల ఆధ్యాత్మిక కేంద్రం. అటువంటి ఈ ప్రాంతానికి యాత్రికుల కోసం రహదారులను అభివృద్ధి చేయలేదు. దూబచర్ల నుంచి ద్వారకా తిరుమల వెళ్లే రోడ్డు వేయలేదు. తాజాగా మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు. అధ్వానంగా ఉన్న నల్లజర్ల నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డు, నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం, దూబచర్ల నుంచి గూడెం వెళ్లే రోడ్డు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దీంతో ఎట్టకేలకు ఇప్పుడిప్పుడే రోడ్డు వేయడం ప్రారంభించారు. ఈ నియోజకవర్గంలో వ్యవసాయ రంగంపై అధిక శాతం మంది ఆధారపడి ఉన్నారు. వరి, పొగాకు, మొక్కజొన్న సాగవుతున్నాయి. మిచౌంగ్ తుపానుకు టార్పాలిన్లు ఇచ్చిన దాఖలాలు లేవు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో రజకుల పేట దశాబ్ద కాలంగా ముంపునకు గురవుతోంది. సుమారు 100 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. శాశ్వత పరిష్కారం చూపుతామంటూ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. అంబేద్కర్ భవన్ కూడా నిర్మించలేదు.



నియామక పత్రం అందుకుంటున్న రామారావు

ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ జెటి.రామారావు

ప్రజాశక్తి-కడియం

ఎపి ప్రజాసంఘాల జెఎసి అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త, రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ నేత జెటి.రామారావు ఎపి ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఐఎన్‌టియుసి ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ ఎకె.చౌదరి ఢిల్లీలో రామారావుకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఐఎన్‌టియుసి ఇప్పుడు ఫెడరేషన్‌గా మార్పు చెందిందని, దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులు, సమస్యలు, చట్టాల అమలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వెట్టిచాకిరి నుంచి విముక్తి, సమాన పనికి సమాన వేతనం, కొత్త వేతన చట్టాలపై నూతన పాలసీ తదితర అంశాలపై అవగాహన మరింత పోరాటాలకు బలమైన మిలిటెంట్ టీమ్‌ను దేశవ్యాప్తంగా సిద్ధం చేస్తున్నారని చెప్పారు. తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ పెద్దలకు, పార్టీ ఎపి వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్, పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గిడుగు రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

7న చాగల్లు మండల సమావేశం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 7న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపిడిఒ ఎస్.బుజ్జి తెలిపారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆయా అధికారులు హాజరు కావాలని తెలిపారు.

చట్టబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

ఎన్నికల్లో విధులను చట్టబద్ధతతో నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎన్నికల విధులు, బాధ్యతలపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులుతో కలిసి కలక్టరేట్ అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాధ్యతలను కేటాయించారన్నారు. అప్పగించిన అంశాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఉత్తర్వుల మేరకు చేపడుతున్న కార్యకలాపాలు సమర్థవంతంగా చేయాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు ఎలక్షన్స్ సెల్‌తో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. డిఆర్ఒ సమన్వయకర్తగా కీలకమైన బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏ రోజు వచ్చిన టపాల్స్ ఆ రోజే పరిష్కరించడం, జవాబు ఇవ్వడం, వివిధ విభాగాలకు, కార్యాలయాలకు ఎండార్స్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ వారీ కార్యాలయ విధుల్లో నిబద్ధత కలిగి ఉండని సందర్భంలో వివరణ కోరతామన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే, పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎన్నికల విధులను సక్రమంగా చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన తదుపరి ఆయా పనుల్లో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలనిని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, ఎఒ బివిఎస్.రామారావు, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సబ్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ్

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తాళ్లపూడి మండలంలో పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను సబ్ కలెక్టర్ అస్తో శ్రీవాత్సవ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేగేశ్వరపురంలో 28వ పోలింగ్ కేంద్రం వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద గల లోపాలను గుర్తించి వాటిని సరి చేయాలని ఆదేశించారు. మండలంలోని మలకపల్లి, వేగేశ్వరపురంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వాటి పరిసరాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట మండల తాసిల్దార్ శ్రీనివాసరావు ఆర్ఐ కిషోర్ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పదో తరగతి పరీక్షలకు అంతా సిద్ధం

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 18వ తేదీ నుండి 27వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అంతా సన్నద్ధంగా ఉన్నట్లు ఎంఇఒలు వి.ఖాదర్ బాబు, సిహెచ్.సుధాకర్ తెలిపారు. చాగల్లు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 506 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరిలో 246 మంది బాలురు, 260 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏడు ప్రైవేటు స్కూల్స్ నుంచి 107 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ప్రభుత్వ, ప్రైవేటు పదో తరగతి విద్యార్థులు మొత్తం 613 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్



రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రాజవోలులో గ్రామంలో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి రూ.1.64 కోట్లతో పలు అభివద్ధి కార్యక్రమాలకు మంగళవారం ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో ఆరోగ్య కేంద్రాలను, వ్యవసాయ సాగులో అత్యంత సాంకేతిక విధానం గ్రామాల్లోని రైతులకు తెలిపేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఇంటింటికీ తాగు నీరు అందించేదుకు జలజీవన్ పథకం ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులను విస్తరిస్తూ అభివద్ధి చేస్తున్నామన్నారు.

ఇందులో భాగంగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం రాజవోలులో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభించుకున్నామన్నారు. రాజవోలు గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య కలపకుండా జల జీవన్ పథకం ద్వారా రూ.61.80 లక్షలతో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించామన్నారు. రాజవోలు గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించనున్న వివిధ అంతర్గత సిసి రోడ్లు, శ్మశాన వాటిక పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. తొలుత బొమ్మూరు టిడ్కో గృహాల సముదాయం వరకూ రూ.40 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎస్ఇ పాండురంగారావు, డిఇ శేషగిరిరావు, ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, ఎఇ సంపత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి నక్కా రాజబాబు, మాజీ ఎంపిటిసి నక్కా శ్యాంబాబు, సొసైటీ చైర్మన్ గిరిజాల రామకృష్ణ, స్థానిక నాయకులు పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, బూసి కృష్ణ, జుత్తుక వసంతు, సింహాద్రి రామలక్ష్మి పేట రామకష్ణ, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు 226 మంది హాజరు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ పరీక్షలకు 226 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పావని తెలిపారు. పరీక్ష హాలుకు హైపవర్ కమిటీ స్క్వాడ్ వచ్చినట్లు ఆమె తెలిపారు.

నేడు ఆసుపత్రి విభాగాలు ప్రారంభం

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎక్స్ రే విభాగం, జెనరేటర్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, జనరల్ ల్యాబ్ విభాగాలను హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత, కలెక్టర్ కె.మాధవీలత బుధవారం ప్రారంభించనున్నట్లు హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.చైతన్యరాజు తెలిపారు. గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఎక్స్ రే విభాగము, జెనరేటర్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, జనరల్ ల్యాబ్ విభాగాలను ప్రారంభిస్తారని తెలిపారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-చాగల్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం పరిధిలోని 9 మండలాల విఏలకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిపిఎం హేమంత్ మాట్లాడుతూ ఆయా మండల పరిధిలో రైతుల దెగ్గర నుండి సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువల వాడకంపై లాభ నష్టాలు రైతుల నుంచి మూడు రోజులు పాటు గ్రామాల్లో తిరిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపిఎం వల్లి, తహశీల్దారు ఎం.సావిత్రి, ఎంపిడిఒ ఎస్.బుజ్జి, విఎఎలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు : మంత్రి

ప్రజాశక్తి-నల్లజర్ల



రోడ్డును ప్రారంభించిన మంత్రి తానేటి వనిత

సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. నల్లజర్ల మండలం పోతవరంలో దాదాపు రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో సిసి రోడ్లు, రెండు చోట్ల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను రాష్ట్ర హోమ్ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ప్రారంభించారు. మరో రూ.రెండు కోట్ల 95 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే పోతవరం-యర్నగూడెం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోమ్ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ప్రతిపక్షాలకు జగనన్నను ఎదుర్కొనే ధైర్యం లేక లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలు, విషపు ప్రచారాలతో గుంపులు గుంపులుగా వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి.. జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి తేడాలను ప్రజలు గమనించాలని కోరారు. ముందుగా పోతవరంలో శ్రీపాప నాగు వారి లేఔట్‌లో ట్యాంకు నిర్మాణాన్ని మంత్రి వనిత ప్రారంభించారు. శ్రీశ్రీ కళ్యాణ మండపం వద్ద కానూరి హేమమాలిని నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపు-26ను ప్రారంభించారు. అనంతరం ఎస్‌సి కాలనీ కొత్తపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. హైస్కూల్-సుభద్ర పాలెం రోడ్డులో గడపగడపకు మన ప్రభుత్వం, ఎంపిపి నిధులతో నిర్మించిన రూ.49 లక్షల సిసి రోడ్లు, కల్వర్టుల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

బిసి సదస్సుకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-గోకవరం



బిసి సదస్సుకు తరలిన టిడిపి నాయకులు

మంగళగిరిలో జరిగే జయహో బిసి సభకు మంగళవారం టిడిపి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సగం పైగా ఉన్న బిసిలను సిఎం వైఎస్.జగన్ మోసం చేశాడన్నారు. బిసిల అభ్యున్నతికి సంవత్సరానికి రూ.15 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేల కోట్లు ప్రత్యేక ఉప ప్రణాళిక ద్వారా ఖర్చు చేస్తానని జగన్ హామీ ఇచ్చి మాట తప్పాడని చెప్పారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్ ను 24 శాతానికి తగ్గించి బిసిలకు అన్యాయం చేశాడని తెలిపారు. బిసిలు అధికంగా ఉన్న కొన్ని జిల్లాలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులను ఇన్‌ఛార్జులుగా పెట్టుకుని బిసిల అధికారాన్ని లాక్కున్నారని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అత్యున్నత స్థానం కల్పించింది ఒక్క టిడిపియేనని చెప్పారు.



సభలో మాట్లాడుతున్న బ్యాంక్ ఉన్నతాధికారులు

రైతులకు ట్రాక్టర్ల పంపిణీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌లో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో మంగళవారం రైతులకు ట్రాక్టర్ల కొనుగోలు నిమిత్తం రుణాలు మంజూరు చేశారు. క్రెడిట్ అవుట్ రిచ్ ప్రోగ్రాంలో భాగంగా 30 మంది రైతులకు వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్, క్రిషీ ట్రాక్టర్, కారు కొనుగోలు నిమిత్తం రైతులకు రుణాలు మంజూరు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సుదర్శన్ బట్ పాల్గొన్నారు. రీజన్ హెడ్ కష్ణయ్య, సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సుదర్శన్ బట్ గ్రామీణ స్వయం ఉపాధి సంక్షేమ సంస్థలో ఉపాధి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

వేగేశ్వరపురం, గజ్జరం గ్రామ సచివాలయాలను తహశీల్దారు శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని రికార్డులను హాజరు పట్టీలను పరిశీలించారు. ఈ సమయంలో ఆయా గ్రామాల్లో వాహనాల ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించి అన్ని రకాల సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి వీరన్న ఉన్నారు.

ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పెరవలి : మండలంలోని పేద విద్యార్థులు ఒకటవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్ స్వీకరిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు బిబిఎస్.స్వరూప్ షేక్ నూర్జాన్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తాలన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగులకు 5 శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బలహీనవర్గాలు, బిసిలు, మైనార్టీలకు సీట్లలో రిజర్వేషన్ ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. తల్లితండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000 లోపు ఉండి ఆసక్తిగల ఐదేళ్లు నిండిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో గ్రామ సచివాలయం, మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు.






కవాతులో పాల్గొన్న జెసి తేజ్ భరత్

సిఆర్‌పిఎఫ్ పోలీసుల కవాతు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం ఐజిసిఎల్ కాలనీ వద్ద నుంచి మంగళవారం సిఆర్‌పిఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. జెసి తేజ్ భరత్ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, ఈ కవాతు ప్రదర్శన ద్వారా ప్రజల్లో అవగాహన కలుగుతుందన్నారు. భద్రతా పరంగా ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో కేంద్ర బలగాలు జిల్లాకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, 400 మంది కేంద్ర సిఆర్‌పిఎఫ్ జవాన్లు, రాష్ట్ర పోలీసు బంద సభ్యులు పాల్గొన్నారు.



గడప గడపకూ..లో ఎంఎల్ఎ వెంకట్రావు

మార్కొండపాడులో గడపగడపకూ..

ప్రజాశక్తి-చాగల్లు

మార్కొండపాడు గ్రామంలో 2వ రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు ప్రజలకు వివరించారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎంఎల్‌ఎగా తననను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు చేలంకుల దుర్గామల్లేశ్వర రావు, తహశీల్దారు సావిత్రి, ఎంపిడిఒ ఎస్.బుజ్జి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- గోపాలపురం

జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలని బాపట్ల జీడిమామిడి పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం గోపాలపురానికి చెందిన రైతు జీడి మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న ముప్పన రమణారెడ్డికి చెందిన నాలుగున్నర ఎకరాల జీడిమామిడి తోటలను ఈ బందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వర మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల క్రితం బాపట్లకు చెందిన జీడి మామిడి పరిశోధన కేంద్రం రూపొందించిన జీడి మామిడి మొక్కలను సేద్యానికి వాడి శాస్త్రవేత్తల సూచనలు సలహాలు మేరకు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అత్యధిక దిగుబడి సాధించి జాతీయస్థాయిలో ఉత్తమ రైతుగా గుర్తింపు తెచ్చుకున్నట్టు చెప్పారు. రమణారెడ్డి సాగును పురస్కరించుకొని పలు ప్రాంతాలకు చెందిన రైతులు బాపట్ల నుండి మొక్కలను సేకరించుకొని సుమారు 5 వేల హెక్టార్లలో ఈ పంట సేద్యం చేస్తున్నారన్నారు. చీడపీడల నివారణ అధిక దిగుబడులకు తీసుకోవలసిన చర్యలను గురించి వివరించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా హెక్టారుకు 1600 కేజీల నుండి 2000 కేజీల వరకు దిగుబడి సాధించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ జి.స్రవంతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-కాట్రేనికోన

పల్లంకుర్రు పరిధిలోని వడ్డివారిపేట వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పల్లంకుర్రు గ్రామానికి చెందిన కన్నిడి లక్ష్మణ్ అతని స్నేహితుడు సూర్యతేజతో కలిసి బైకుపై బలుసుతిప్ప నుండి పల్లంకుర్రు వైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆర్‌ఎంపి వైద్యుడు మట్ట సిద్ధార్థ గౌతమ్ వైకును ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. బైకు నడుపుతున్న లక్ష్మణుకు తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన సిద్ధార్థ గౌతమ్ అతని భార్యను స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గౌతమ్ మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. ఆయన భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు సమాచారం. గాయపడిన సూర్యతేజ పరిస్థితి మెరుగైనట్లు వైద్యులు తెలిపారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం తాండపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆక్వా చెరువుల వద్ద ఒడిశాకు చెందిన సందీప్(23) అనే యువకుని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పప్పుల రామకృష్ణారావు అనే ఆక్వా రైతు చెరువుల వద్ద పనిచేయడానికి ఒడిశా నుంచి ఈ కార్మికుడు వలస వచ్చినట్టు తెలిపారు. ఇంటికి వెళ్తాను అని చెప్పి గత నెల 29 నుంచి యువకుడు కనబడడంలేదన్నారు. మంగళవారం యువకుని మృతదేహం కనిపించడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడు పాలెం పంచాయతీ పరిధి, గుబ్బలవారిపాలెంకు చెందిన శీలం వెంకన్న మద్యంసీసాలు అమ్ముతుండగా మంగళవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు.అతని వద్ద నుండి రెండు బీరు సీసాలు, నాలుగు విస్కీ సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్ఐ టి.కృష్ణ సాయి ఉన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత పెద్దాపురంలో ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో నిందితులు కోమలి రాజు, కోమలి యేసురత్నం లను అరెస్టు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. నాటు సారా కొందరు సరఫరా చేస్తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా తయారీ, అమ్మడం, రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

70 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు చేపట్టిన దాడుల్లో 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్ఇబి సిఐ ఎల్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..ఏలేశ్వరం శివారు అప్పన్నపాలెంలో 50 లీటర్ల సారాతో వ్యక్తిని, వొమ్మంగి గ్రామంలో 20 లీటర్ల సారాతో మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే అప్పన్నపాలెంలో సారా తయారీకై నిల్వ చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం.ఆశాలత, వెంకన్న దొర, కృష్ణ అర్జునరావు, దొరబాబు, రాజు, రాంబాబు, సలాం పాల్గొన్నారు.

తూనికల కొలతల అధికారుల దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో తూనికల కొలతల అధికారులు పలు దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. తూకాలు వేసి బారువు మిషన్లు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసి దుకాణదారులకు జరిమానాలు విధించారు. అలాగే ఆ తూకాలకు సీల్ వేశారు. ఈ దాడుల్లో పెద్దాపురం తునికల కొలతల అధికారులు పాల్గొన్నారు.

బాంబే హైకోర్టు తీర్పు హర్షణీయం

ఏలేశ్వరం : మానవ హక్కుల సంరక్షణ నాయకుడు, ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా బాంబే హైకోర్టు తీర్పు ఇవ్వడంపై ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) రాష్ట్ర నాయకుడు బుగత శివ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రొఫెసర్ సాయిబాబాను భీమా ఖోరెగావ్ కుట్రలో సంబంధాలు ఉన్నాయని, ఎన్ఐఎ 10 ఏళ్ల క్రితం ఉపా చట్టం కింద జైల్లో పెట్టడం దారుణం అన్నారు. వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై బెయిలుకు అవకాశం లేని ఉపా చట్టం ప్రయోగించడం అన్యాయమని అప్పట్లో మేథావులు, మానవతావాదులు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు.

నూరు శాతం పల్స్ పోలియో

కాజులూరు : పల్స్ పోలియో నూరు శాతం పూర్తయిందని గొల్లపాలెం పిహెచ్‌సి వైద్య అధికారిణి ఎన్ .సౌజన్య తెలిపారు. మంగళవారం గొల్లపాలెం, దగ్గుదుర్రు పిహెచ్‌సి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పిహెచ్‌సి పరిధిలో 2,357 మందికి పోలియో చుక్కలు వేశామని తెలిపారు. అలాగే దుగ్గుదుర్రు పిహెచ్‌సి పరిధిలో 2,284 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2276 మందికి వేసినట్లు దగ్గుదురు పిహెచ్‌సి వైద్యాధికారిణి సుప్రియ తెలిపారు. పోలియో చుక్కలు వేయడంలో సహకరించిన ఆశా వర్కర్లకు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు శ్రేయ, వైద్య సిబ్బంది రాజారావు, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆర్ఎఒ మునిస్వామితో మాట్లాడుతున్న నాయకులు

సబ్ రిజిస్ట్రార్‌ను తక్షణమే నియమించాలి

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ రిజిస్ట్రార్‌ను తక్షణమే నియమించాలని పలువురు ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామిని కోరారు. యానాం విశ్రాంత పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అన్నా డిఎంకె పార్టీ యానాం కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, కామిశెట్టి నాయుడు, చింతం అజయ్, ఏరుబండి స్వామి, చిట్టి రాజు తదితరులు మంగళవారం పరిపాలనాధికారిని కలిసి సబ్ రిజిస్ట్రార్ లేకేపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే సబ్ రిజిస్ట్రార్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సాహితీ సదస్సుకు శిఖామణికి ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడలో జరుగుతున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సులో పాల్గొనేందుకు ప్రముఖ కవి, కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 10న జరిగే సభలో దళిత కవిత్రయం కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న అనే అంశంపై తాను ప్రసంగించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో కవిసంధ్య 47వ సంచికను వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టన్‌రాజు ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని తంటికొండలో వైసిపి నాయకులు ఆధ్వర్యంలో వైసిపి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ అనే బేధం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలే మళ్లీ ఆయనను సిఎం చేస్తాయన్నారు. ప్రతి పేదవాడి హృదయంలో చిరస్థాయిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో మనమంతా అహర్నిశలు కష్టపడి వైసిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ, అప్పన్న దొర, దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి రాంబాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బదిరెడ్డి నాగ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాపాకలో పల్స్ పోలియో

ప్రజాశక్తి - సీతానగరం

పోలియో వ్యాధిని నిర్మూలించేందుకు ఐదేళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్లు చైతన్య, ఎన్.రాజు అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వారు తెలిపారు. పోలియో వ్యాధిని నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా ప్రతి ఏడాదీ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేస్తున్నారని చెప్పారు. నిండు జీవితానికి రెండు ట చుక్కల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్టు వివరించారు. ఈ నేపథ్యంలో రాపాక గ్రామ పంచాయితీ ఎఎన్ఎం తగరం రోజామణి మాట్లాడుతూ 3న రాపాక ఎంపీపీ స్కూల్లో పల్స్ పోలియో ప్రోగ్రాం నిర్వహించామని, నాలుగు, ఐదో తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పూర్తిస్థాయిలో పిల్లలను గుర్తించి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పలివెల చిన్నారి, ఆశా వర్కర్లు పెనుబోయిన వెంకటలక్ష్మి, అత్తిలి సాయి, నల్లగొండ గ్రామ పంచాయతీ ఆశా వర్కర్ నక్కా బేబీ, అంగన్వాడీ కార్యకర్త మాజేటి మంగ, సనమండ్ర గౌతమ్ రాజ్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగుల రెండు నెలల బకాయి వేతనాలు తక్షణం విడుదల చేయాలని సిఐటియు జిలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్‌లో ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్ 20 నుంచి 2024 జనవరి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల 21 రోజుల సమ్మె చేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తూ ఆదేశాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలు ఇచ్చి నేటికి రెండు నెలలు గడుస్తున్నా హెచ్‌ఆర్ పాలసీ కమిటీని ఇంతవరకు నియమించలేదని తెలిపారు. తక్షణం ఇచ్చిన హామీల మేరకు ఆదేశాలను విడు దల చేయాలని డిమాండ్ చేశారు, చిరుద్యోగులైన సమగ్రశిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు జీతాలు రాక ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు ఫీజులు చెల్లిం చలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే బకాయి పడిన రెండు నెలల వేతనాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగులందరూ ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమగ్రశిక్షా అమలుకు కేంద్రం నిధులు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ప్రభుత్వ ఇతర అవసరాలకు మళ్లించ డంవల్లే వేతనాలు బకాయపెట్టే పరిస్థితి ఎదురయ్యిందని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ఎన్నికల ఖర్చుల అంచనా సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల ఖర్చుల అంచనాపై జెసి తేజ్ భరత్ మంగళవారం పలువురితో సమీక్షించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో హోటల్ మేనేజ్మెంట్, లాడ్జిలు, ప్రింటర్స్, ఫ్లెక్సీ, ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, సిటీ కేబుల్ నెట్ వర్క్, రవాణా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించే క్రమంలో ఆయా అభ్యర్థులు చేసే ఖర్చులకు చెందిన సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు, వాటికి వారూ చేసే ఖర్చుల వివరాలు ఆడిటింగ్ చేస్తామన్నారు. జిల్లాలోనే వివిధ రకాల ఖర్చుల నిమిత్తం వారు నిర్ధారించిన ధరలను ఆయా అభ్యర్థుల ఖాతాలకు జమ చేసి లెక్కిస్తామన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థులు రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థులు రూ.95 లక్షల వరకూ మాత్రమే ఖర్చు చేయడానికి అవకాశం ఉందన్నారు. ఆ మేరకు అభ్యర్థుల ఖర్చులను తనిఖీ చేసే బృందాలు వాటినీ ఆడిటింగ్ చేస్తాయన్నారు. వివిధ ప్రచారాలు నిర్వహించే క్రమంలో తప్పని సరిగా ముద్రించే కరపత్రాలు సంఖ్య, గోడ ప్రతుల సంఖ్య, ప్రింటింగ్ కోరిన వారి వివరాలు, ప్రింటర్ వివరాలు తప్పనిసరి అన్నారు. అనధికారికంగా ప్రచురణ, ప్రసారం చేయడం ఉల్లంఘన కింద పరిగణిస్తారని తేజ్ భరత్ పేర్కొన్నారు. కేబుల్ టీవీలలో ప్రసారం అయ్యే స్క్రోలింగ్, ప్రకటనల సమాచారం తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సభలు సమావేశాల ఖర్చులను అంచనా వేసి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా చూపుతామన్నారు.



బాబు ష్యూరిటీలో పాల్గొన్న టిడిపి నాయకులు

అప్పల రాష్ట్రంగా మార్చిన వైసిపి

ప్రజాశక్తి-గోపాలపురం

ఐదేళ్ల వైసిపి పాలనలో సామాన్యులు బతకలేని పరిస్థితి తీసుకువచ్చి అప్పుల రాష్ట్రంగా తయారుచేసిన ఘనత సిఎం వైఎస్.జగన్‌కే దక్కుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మద్దిపాటి వెంకటరాజు ఆరోపించారు. గోపాలపురంలో భూరెడ్డి అభిరామ్ కార్యాలయం వద్ద బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మద్దిపాటి వెంకటరాజు, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి టిడిపి మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల పేరుతో సిఎం జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అరకొరగా ప్రజలు ఖాతాల్లో డబ్బులు వేసి ప్రజల దగ్గర నుండి తొమ్మిది సార్లు కరెంట్ బిల్లులు పెంచారని, డీజిల్, పెట్రోల్, నిత్యావసర ధరలు పెంచి దోచుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి వైసిపి ప్రభుత్వం ఏర్పాటుకు ముందు వరకు ఈ రాష్ట్రం అప్పు కేవలం రూ.3.5 లక్షల కోట్లు మాత్రమే ఉండేదన్నారు. కేవలం ఈ ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి మరొక రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. 53 మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మద్దిపాటి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జేష్ఠ శ్రీధర్, వడ్లమూడి రమేష్, యంత్ర ప్రగడ మంగారావు, బొర్ర ఆంజనేయులు, రవి, ప్రసాదు, దొరబాబు పాల్గొన్నారు.



పారిశుధ్య పనుల్లో పాల్గొన్న మంత్రి వేణుగోపాల కృష్ణ

ప్రజారోగ్య పరిరక్షణకు స్వచ్ఛత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా రాజవోలు గ్రామంలో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, నగరాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్త కుప్పలు క్లీన్ చేయడం, ఇళ్ల మధ్య నీటి గుంతలు కనిపించకుండా పరిశుభ్రం చేయడం, రోడ్లపై చెత్త, మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించి మెరుగైన శానిటేషన్ పై అధికారులు దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్త కుప్పలు క్లీన్ చేయడం, ఇళ్ల మధ్య నీటి గుంతలు కనిపించకుండా పరిశుభ్రం చేయడం, రోడ్లపై చెత్త, మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచే విధంగా పురపాలక సంఘ అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, ఎఇ సంపత్ కుమార్, మాజీ ఎంపిపి నక్కా రాజబాబు, మాజీ ఎంపిటిసి నక్కా శ్యాంబాబు, సొసైటీ చైర్మన్ గిరిజాల రామకృష్ణ, స్థానిక నాయకులు వెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, బూసి కృష్ణ, జుత్తుక వసంతు, సింహాద్రి రామలక్ష్మి పేట రామకష్ణ, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



భార్య బిడ్డలను శివ దుర్గకు అప్పగిస్తున్న పోలీసులు

వివాహితను కాపాడిన రైల్వే పోలీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

భర్త చేస్తున్న అప్పులతో మనస్తాపానికి గురై తన చిన్నారితో సహ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన ఒక వివాహితను రైల్వే పోలీసులు కాపాడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సామర్లకోట రైల్వే ఎస్ఐ బిలోవరాజు అందించిన వివరాల ప్రకారం.. సామర్లకోట మండలం వికె రాయపురం గ్రామానికి చెందిన మలిరెడ్డి నాగమహాలక్ష్మి ఆమె భర్త శివ దుర్గ వద్దంటున్నా అప్పులు చేస్తూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో మనస్థాపానికి గురైయిన నాగమహాలక్ష్మి తన చిన్నారిని తీసుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆమెను పల్స్ పోలియో విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మహాలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ఆమె భర్తను రప్పించి ఇరువురకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం మహాలక్ష్మిని భర్తకు అప్పగించినట్టు ఎస్ఐ లోవరాజు తెలిపారు.

మహాశివరాత్రికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ఉండ్రాజవరం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు సూచించారు. మహాశివరాత్రి పర్వదినానికి ప్రసిద్ధిగాంచిన పాలంగి ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రికులకు ఇబ్బంది లేకుండా బారికేడ్ల ఏర్పాటు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉత్సవ కమిటీ, నాయకులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, వైసిపి నాయకులు పాలాటి శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

9న చంద్రబాబు సభ వాయిదా

జగ్గంపేట : ఈ నెల 9న ప్రత్తిపాడులో చంద్రబాబు బహిరంగ సభ వాయిదా పడిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇర్రిపాకలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల 9న ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభ వాయిదా వేశారని, ఈ నెల 10వ తేదీన జగ్గంపేటలోని పరిణయ ఫంక్షన్ హాల్లో టిడిపి, జనసే కార్యచరణ కోసం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.